సాక్షి ఒడిశా
బుధవారం । 28 । ఆగస్టు । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం మంగళవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.3,07,356లు, బంగారం 100 మిల్లీ గ్రాములు, వెండి 14 గ్రాముల 100 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



పశువుల వ్యాపారులపై దాడులు తగవు

పేద పశువుల వ్యాపారులపై స్మగ్లర్ల పేరుతో దాడులు చేయడం తగదని పలువురు పేర్కొన్నారు.

- 8లో



గుర్తింపు కార్డులు అందజేత

నబరంగ్‌పూర్ జిల్లా డాబుగాం పోలీసులు సీనియర్ సిటిజన్లకి గుర్తింపు కార్డులు అందజేశారు.

- 8లో

న్యూస్‌రీల్

సాంప్రదాయాలు కాపాడడం మన కర్తవ్యం

- సబ్ కలెక్టర్ కల్యాణి సంఘమిత్రాదేవి



సబ్ కలెక్టర్ కల్యాణిని సత్కరిస్తున్న క్లబ్ సభ్యులు

రాయగడ: సంస్కృతీ, సాంప్రదాయాలను కాపాడడం మన కర్తవ్యమని సబ్ కలెక్టర్ కల్యాణి సంఘమిత్రా దేవి అన్నారు. స్థానిక లయన్స్ క్లబ్ భవనంలో క్లబ్ ది యంగ్ ఇండియా ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన సందోత్సవాలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పూర్వం నుంచి వస్తున్న ఆచార వ్యవహారాలను గౌరవించడం మన బాధ్యత అన్నారు. క్లబ్ వ్యవస్థాపకుడు సురేంద్ర సాహు మాట్లాడుతూ గత రెండు దశాబ్దాలుగా రాయగడలో తమ క్లబ్ సేవలు అందిస్తోందని తెలియజేశారు. కొద్దిమందితో ప్రారంభమైన ఈ క్లబ్ అంచెలంచెలుగా అభివృద్ధి చెందిందని వివరించారు. క్లబ్ ఆధ్వర్యంలో ఎన్నో సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో క్లబ్‌కు చెందిన చిన్నారి విజయ్, డాక్టర్ వై.రుక్మాంగధరావు, జామి గౌరీ శంకరరావు, ముచ్చి రవికుమార్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య



యువకుని మృతదేహం

రాయగడ: సదరు సమితికి సమీపంలోని వీరనారాయణపురం వద్ద రైలు కిందపడి ఒక యువకుడు దుర్మరణం పాలయ్యాడు. విశాఖపట్నం నుంచి నిజాముద్దీన్ వెళ్లే సమతా ఎక్స్‌ప్రెస్ రాయగడ మీదుగా వెళ్తుండగా స్థానిక సాయిప్రియ నగర్‌లో నివాసముంటున్న సంతోష్ కుమార్ బర్ల(32) రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఇతని సొంత ఊరు జిల్లాలోని పద్మపూర్ సమితి ఇందుపురం గ్రామం. జేకేపూర్‌లో చిరువ్యాపారం చేసుకొని జీవిస్తున్నారు. రైల్వే పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు.

మహిళ మెడలో చైన్ స్నాచింగ్



బాధితురాలు లత

పర్లాకిమిడి: స్థానిక మార్కెట్ జంక్షన్ వద్ద ఒక మహిళ స్కూటీ మీద వెళ్తుండగా ఇద్దరు వ్యక్తులు బైక్ వచ్చి మహిళ మెడలో ఉన్నటువంటి నాలుగు తులాల బంగారు చైన్‌లు లాక్కొని వెళ్లిపోయినట్లు ఆదర్శ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆరో వార్డు సేరివీధికి చెందిన వడ్డాది లత (42) కొత్త బస్టాండ్ వద్ద ఆహార కేంద్రంలో మేనేజర్‌గా పనిచేస్తోంది. ఆమె మెడలో ఉన్న రెండు బంగారు చైన్‌లు ఇద్దరు అగంతులు హెల్మెట్, మాస్కులు ధరించి వచ్చి లాక్కొన్నట్లు పేర్కొన్నారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమంగా తరలిస్తున్న కలప స్వాధీనం



పట్టుబడిన కలప, నిందితులను చూపిస్తున్న అధికారులు

పర్లాకిమిడి: గారబంద అటవీ శాఖ రేంజ్ పరిధి కించిలింగి వద్ద సోమవారం రాత్రి ఒక పికప్ వ్యాన్‌లో ఆంధ్రప్రదేశ్‌కు అక్రమంగా తరలిస్తున్న టేకు దుంగలను అటవీ శాఖ అధికారులు పట్టుకున్నారు. గుసాని సమితి భీంపూర్ గ్రామానికి చెందిన సామ్యుల్ శోబోరో వ్యాన్‌లో 36 దుంగలు తరలిస్తుండగా పట్టుకున్నట్లు వెల్లడించారు. వాటి విలువ మార్కెట్‌లో సుమారు రూ.40 వేలు ఉంటుందని అటవీ రేంజ్ అధికారి అలోక్ జెన్నా తెలియజేశారు. ఈ టేకు దుంగలు కోయిపూర్ అటవీ ప్రాంతం నుంచి కించిలింగి మీదుగా ఆంధ్రప్రదేశ్‌కు తరలిస్తున్నట్లు నిందితులు పేర్కొన్నారు. ఈ కేసుకు సంబంధించి నలుగురు నిందితులను అరెస్టు చేశారు. వారిలో ప్రశాంత్ శోబోరో, ఆయోబ్ శోబోరో, సంతోష్ శోబోరో, నాగేస్ శోబోరో ఉన్నారు. వారిని జ్యుడీషియల్ కస్టడిలో కోర్టుకు మంగళవారం తరలించారు. ఈ దాడిలో గారబంద ఫారెస్టు అధికారి దుర్యోధన జెన్నా, ఫారెస్టు గార్డు కె.గిరీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

● పర్యావరణ పరిరక్షణకు



కొరాపుట్ జిల్లా ఒడిశా జర్నలిస్టు అసోసియేషన్ సభ్యులు, భువనేశ్వర్ రోటరీ క్లబ్ సభ్యులు జయపురం సమితి గొడొపొదర్ పంచాయతీ దుబిలి గ్రామంలోని లొండా పాడ్ వద్ద మొక్కలు నాటే కార్యక్రమం మంగళవారం నిర్వహించాయి. ఈ సందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు విశ్వ భూషణ కర్ మాట్లాడుతూ.. మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేణుధర పండా, కొరాపుట్ జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాసరావు, సలహాదారు వి.భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

- జయపురం

● రహదారిపై వరినాట్లు



మల్కన్‌గిరి జిల్లా మల్కన్‌గిరి సమితి తాలగూడ గ్రామానికి వెళ్లే రహదారి అధ్వానంగా ఉంది. వర్షం వస్తే బురదమయంగా మారుతోంది. దీంతో గ్రామానికి సరైన రహదారి నిర్మాణం చేయాలని కోరుతూ గ్రామస్తులంతా బురద రోడ్డుపై మంగళవారం నాట్లు వేశారు. ఇప్పటివరకు ఎన్నోసార్లు అధికారులకు చెప్పినా ఎవరూ పట్టించుకోలేదని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. రహదారి వలన అత్యవసర సమయాల్లో అంబులెన్స్ గ్రామంలోకి రాక రోగులకు ఇబ్బందికర పరిస్థితులు తలెత్తుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

- మల్కన్‌గిరి

● మట్టి విగ్రహాల విక్రయాలు

ఆంధ్రప్రదేశ్‌లోని అనకాపల్లి నుంచి మట్టి విగ్రహాలను తీసుకొచ్చి బ్రహ్మపురలో చౌకగా విక్రయించనున్నారు. ఈ మేరకు నగరానికి చెందిన రోటరీ క్లబ్ ఏర్పాట్లు చేసింది. పర్యావరణ పరిరక్షణ, పెరిగిన విగ్రహాల ధరల నేపథ్యంలో ఈ నిర్ణయం చేశారు. ఈ మేరకు మొత్తం 1,600 విగ్రహాలు తెప్పించారు. నగరంలోని ప్రేమ్‌నగర్‌లో ఉన్న రోటరీ భవన్‌లో ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు, సాయంత్రం 5 గంటల నుంచి 8 గంటల వరకు విక్రయిస్తారు. రవాణా ఖర్చులు రోటరీ క్లబ్ భరించి తక్కువ ధరలతో అందుబాటులోకి తీసుకొచ్చారు.



- కొరాపుట్

అలిభట్టలో.. అతిసారం విజృంభణ

- ఒకే కుటుంబంలో తల్లీకూతుళ్లు మృతి



అంబొదల ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అలిభట్ట గ్రామస్తులు



చికిత్స పొందుతున్న బాలిక

రాయగడ: గత కొద్దిరోజులుగా జిల్లాలోని ప్రజలు మలేరియా, డెంగీ వంటి వ్యాధులతో సతమతమవుతుండగా, దీనికి తోడు అతిసారం మరలా జడలు విప్పుతోంది. ఈ వ్యాధితో గత నెల రోజుల్లో పదిమంది మృతి చెందగా, తాజాగా జిల్లాలోని మునిగుడ సమితి రఘుబారి పంచాయతీలోని అలిభట్ట గ్రామంలో ఒక కుటుంబానికి చెందిన తల్లి తెములి మాఝి (47), ఆమె కూతురు సజనీ మఝి(15)లు మృతి చెందారు. కొద్ది రోజులుగా విరేచనాలు, వాంతులతో బాధపడుతున్న వీరిద్దరూ ఇంట్లోనే నాటు వైద్యం చేసుకుంటూ కాలం గడిపారు. వ్యాధి తీవ్ర రూపం దాల్చడంతో అస్వస్థతకు గురై ఆదివారం ఇద్దరూ మృతి చెందారు. ఇదిలా ఉండగా అతిసారంతో ఈ గ్రామంలో మరో పదిమంది బాధపడుతున్నారు. వీరిలో కొంత మంది పొరుగు జిల్లా కలహండిలోని భవానీపట్నంకు చికిత్స కోసం వెళ్లగా, మరి కొందరు మునిగుడ, అంబొదల, బసంకటక్‌లోని క్రిస్టియన్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. మునిగుడ సమితిలోని డిమిరిగుడ, అమడాపాదొరొ, బుచుకాబంగు తదితర గ్రామాల్లో ప్రస్తుతం అతిసారం విపరీతంగా ఉంది. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ సకాలంలో స్పందించి చికిత్సను అందిస్తున్నప్పటికీ ఇంకా వ్యాధి అదుపులోకి రావడం లేదు.

మూఢ నమ్మకాలకు బలి

జిల్లాలో అధికశాతం ఆదివాసీలు నివసిస్తున్నారు. కొండ, మారుమూల ప్రాంతాల్లో నివసిస్తున్న ఆదివాసీలు ఇప్పటికీ మూఢ నమ్మకాలతోనే కాలం గడుపుతున్నారు. గ్రామంలో ఎవరికైనా అనారోగ్యం చేస్తే ఆస్పత్రికి వెళ్లకుండా దిసారి (పూజారి)చే పూజలు చేయించుకుని, వారు ఇచ్చిన నాటు వైద్య మందులను వాడుతూ ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. తాజాగా ఈ పరిస్థితి మునిగుడలోని అలిభట్ట గ్రామ సమీపంలో కనిపించింది. అనారోగ్యంతో బాధపడుతున్న ఒక యువతికి తెల్ల దుస్తులు కట్టి పూజలు నిర్వహించి మంత్రిస్తున్న దిసారి వైనం వెలుగు చూసింది. దీంతో వీరి మూఢ నమ్మకాలే ప్రాణాలు పొగొట్టుకుంటున్న స్థాయికి వస్తున్నాయని వైద్యులు అంటున్నారు. అనారోగ్యం వస్తే వైద్యులను సంప్రదించాలని సూచిస్తున్నారు.



మూఢ నమ్మకాలతో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం(ఫైల్)





ప్రైవేట్ క్లినిక్‌పై దాడులు



క్లినిక్ వద్ద సీడీఎంవో సుశాంత్ కుమార్ తదితరులు

కొరాపుట్: జిల్లాలోని నారాయణపట్న సమితి కేంద్రంలో ఉన్నటువంటి ప్రైవేట్ క్లినిక్ మీద అధికారులు మంగళవారం దాడులు నిర్వహించారు. జిల్లా ముఖ్య వైద్యాధికారి (సీడీఎంవో) సుశాంత్ కుమార్ స్వయంగా ఈ దాడిలో పాల్గొన్నారు. గత కొద్ది సంవత్సరాలుగా ఎటువంటి అనుమతులు లేకుండా ఈ క్లినిక్ నడుస్తోంది. అందులో సామన్య యువకులు ల్యాబ్ కూడా నడుపుతున్నారు. వేరే ప్రాంతాల నుంచి వైద్యులను తెప్పించి చికిత్స చేయిస్తున్నారు. వారికి కూడా ఎటువంటి విద్యార్హతలు లేవు. గత కొద్ది రోజులుగా నారాయణపట్నలో డెంగీ వ్యాపించి ఇద్దరు మృత్యువాత పడగా, మరో 50 మంది ఆంధ్రప్రదేశ్‌లో చికిత్స పొందుతున్నారు. వీరికి జరిపిన రక్త పరీక్షలపై అనేక సందేహాలు ఉన్నాయి. దీంతో అధికారులు రహస్య దర్యాప్తు చేయగా ఈ క్లినిక్ బాగోతాలు వెలుగులోకి వచ్చాయి.

పక్కా ప్లానింగ్‌తో...

దాడుల్లో భాగంగా కొరాపుట్ నుంచి సీడీఎంవో సుశాంత్ కుమార్ నారాయణపట్న చేరుకొని ప్రభుత్వ ఆస్పత్రికి చేరుకున్నారు. తన డ్రైవర్‌ని ఆ క్లినిక్‌కు పంపి పరీక్షలు చేయించమన్నారు. డ్రైవర్ వెళ్లి డెంగీ పరీక్ష కోసం అడగగా రూ.1,150 తీసుకొని తమకు తోచిన విధంగా రిపోర్టు ఇచ్చారు. ఇదే సమయంలో సీడీఎంవో క్లినిక్‌పైకి సిబ్బందితో వెళ్లారు. వాళ్లని చూసిన క్లినిక్ సిబ్బంది కిటికీల నుంచి దూకి పరారయ్యారు. అధికారులు సోదాలు ప్రారంభించగానే స్థానికంగా ఉండే కొందరు యువకులు అధికారులను అడ్డగించారు. దీంతో నారాయణపట్న ఐఐసీ సుస్మితా కంవార్, తహసీల్దార్ సంగీతలు అక్కడికి చేరుకొని వారిని అదుపు చేశారు. సదరు నకిలీ వైద్యుడిని అదుపులోకి తీసుకొని ప్రశ్నిస్తున్నారు.

కలెక్టరేట్ ముట్టడి




ర్యాలీ నిర్వహిస్తున్న ఆందోళనకారులు




కలెక్టరేట్‌ను ముట్టడించిన దృశ్యం

కొరాపుట్: ముందుగా ప్రకటించిన విధంగానే నాగేశ్వరి గుహల పరిసర ప్రాంతాల ప్రజలు కొరాపుట్ కలెక్టరేట్‌ని మంగళవారం ముట్టడించారు. కొరాపుట్ జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్ జంక్షన్ నుంచి భారీ ర్యాలీ ప్రారంభించారు. కొంతమంది గిరిజనులు వారి సాంప్రదాయ ఆయుధాలతో ర్యాలీలో పాల్గొన్నారు. అదానీ, ముద్ర, కళింగ అల్యూమినియా, మైత్రి కంపెనీలకు వ్యతిరేకంగా గోబ్యాక్ నినాదాలు చేశారు. ఈ ర్యాలీలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఉండడానికి పెద్ద ఎత్తున పోలీసు బలగాలు మోహరించారు. అనంతరం కలెక్టరేట్ వద్ద జరిగిన సభలో గిరిజన నేతలు ప్రసంగించారు. తాము ఎన్నో తరాలుగా పూజిస్తున్న నాగేశ్వరి దేవత ఉన్న గుహలు తవ్వడానికి అంగీకరించమని ప్రభుత్వానికి స్పష్టం చేశారు. గుహలు ఉన్న బల్దా ప్రాంతంలో బాక్సైట్ గనుల తవ్వకానికి ప్రయత్నం చేస్తున్న ప్రైవేటు కంపెనీలు వెనక్కి తగ్గాలని హెచ్చరించారు. గతంలో చెప్పినట్లుగా ఈ గుహలను పర్యాటక ప్రాంతాలకు అభివృద్ధి చేయాలని కోరారు. అనంతరం కలెక్టర్ వి.కీర్తివాసన్‌తో ఆందోళనకారుల ప్రత్యేక బృందం సమావేశమైంది. వారి డిమాండ్లు విన్న కలెక్టర్ స్పందించారు. ఈ నెలాఖరు నాటికి బీడీవోని బల్దా ప్రాంతానికి పంపించి క్షేత్రస్థాయి పరిశీలన చేయిస్తామన్నారు. ఆందోళనకారులకు ముంపు ప్రాంతాల నిర్వాసితుల సంఘం, రైల్వే నిర్మాణాల నిర్వాసితులు సంఘం, నాగేశ్వరి గుహల పరిరక్షణ కమిటీ తదితర సంఘాలు మద్దతు పలికాయి.

ఇటుకల ఫ్యాక్టరీలో కార్మికుడి దుర్మరణం



అజిత్ మృతదేహం



పోలీసుస్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న బాధిత కుటుంబీకులు, గ్రామస్తులు

రాయగడ: సిమెంట్ ఇటుకల తయారీ ఫ్యాక్టరీలో ఒక కార్మికుడు మృతి చెందిన ఘటన జిల్లాలోని బిసంకటక్ సమితి దువాబడి గ్రామంలో చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి అజిత్ పిడిక (45)గా గుర్తించారు. వివరాల్లోకి వెళ్తే.. బిసంకటక్‌లో దుర్గీ సమీప దువాబడి గ్రామంలోని సిమెంట్ ఇటుకల ఫ్యాక్టరీలో అజిత్ పనిచేస్తున్నాడు. ఎప్పటిలాగే సోమవారం పనికోసం ఫ్యాక్టరీకి వెళ్లాడు. అయితే అక్కడ క్రషర్ మెషిన్‌ను శుభ్రం చేస్తుండగా ప్రమాదవశాత్తు అందులో పడి మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న ఫ్యాక్టరీ యజమాని బి.సురేష్‌రావు వెంటనే బిసంకటక్ ఆస్పత్రికి తరలించాడు. అయితే అప్పటికే అజిత్ మృతి చెందినట్లు వైద్యులు పేర్కొన్నారు. అజిత్ ఫ్యాక్టరీలో మృతి చెందినట్లు తమకు సమాచారం అందించకుండా తరలించడంపై అనుమానం వ్యక్తం చేసిన కుటుంబీకులు, గ్రామస్తులు బిసంకటక్ పోలీసుస్టేషన్‌లో ఫ్యాక్టరీ యజమానిపై ఫిర్యాదు చేశారు. అనంతరం బాధిత కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ గ్రామస్తులు పోలీసుస్టేషన్ వద్ద ఆందోళన చేపట్టారు. ఐఐసీ సంతోషిణి ఓరం గ్రామస్తులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. బహుజన్ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జితు జకసిక బాధిత కుటుంబానికి న్యాయం జరిగేంతవరకు ఆందోళన విరమించేది లేదని స్పష్టం చేశారు. దీంతో ఫ్యాక్టరీ యజమాని బాధిత కుటుంబానికి రూ.5 లక్షల నష్ట పరిహారం చెల్లించడంతో పరిస్థితి సద్దుమణిగింది.

విస్తృతంగా ఎక్సైజ్ దాడులు



కొలాగుడ అడవిలో దాడులు జరిపిన ఎక్సైజ్ సిబ్బంది



కుముదుగుడలో నిందితుడిని అరెస్టు చేసిన సిబ్బంది

జయపురం:

గంజాం జిల్లాలో కల్తీసారా మరణాలు సంభవించడంతో కొరాపుట్ జిల్లా ఎక్సైజ్ అధికారులు అప్రమత్తమయ్యారు. జిల్లాలో ఏరులై పారుతున్న నాటుసారా అడ్డాలు, బట్టీలపై విస్తృతంగా దాడులు నిర్వహిస్తున్నారు. జయపురం సమితి కొలాగుడ అడవిలో నాటుసారా కాస్తున్నట్లు మంగళవారం సమాచారం రావడంతో అధికారులు అక్కడ దాడులు చేపట్టారు. ఆ దాడుల్లో 709 లీటర్ల నాటుసారాతో పాటు సారా తయారు చేసేందుకు సిద్ధపరచిన 1,700 లీటర్ల ఊటను ధ్వంసం చేశారు. అలాగే ఒక వ్యక్తిని అరెస్టు చేసినట్లు జయపురం ఎక్సైజ్ అధికారి నీలాద్రి బిహారి మిశ్ర వెల్లడించారు. నాటుసారా తయారు చేసేందుకు వినియోగిస్తున్న సామాన్లను సీజ్ చేసినట్లు తెలిపారు. దాడుల్లో ఎక్సైజ్ సిబ్బంది స్వాగతిక మహంతి, ఇన్‌స్పెక్టర్ సుధీర్ సాహు, శశికాంత దత్త, అన్నపూర్ణ రథ్, చంద్రశేఖర పాడియారి, సబ్ ఇన్‌స్పెక్టర్ రాజకిశోర్ ఖాడి తదితరులు పాల్గొన్నారు. అలాగే బొరిగుమ్మ సమితిలో ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించి 73 లీటర్ల సారా పట్టుకున్నారు. దీనిలో భాగంగా ఒక వ్యక్తిని అరెస్టు చేసినట్లు వెల్లడించారు. అరెస్టైన వ్యక్తి కుముదుగుడ గ్రామానికి చెందిన నరేంద్ర బిశాయి అని అధికారి బిశ్వజిత్ పాణిగ్రాహి తెలిపారు. ఎస్పీ ఆదేశం మేరకు కుముదుగుడ గ్రామంలో దాడులు జరిపి, నిందితుడిని అరెస్టు చేశామన్నారు.

క్లుప్తంగా

బీజేడీ నుంచి సుస్మితా మాఝీ బహిష్కరణ



సుస్మితా మాఝీ

మల్కన్‌గిరి: జిల్లాలోని మత్తిలి సమితికి చెందిన బీజేడీ పార్టీ జిల్లా పరిషత్ సభ్యురాలు సుస్మితా మాఝీని పార్టీ నుంచి మంగళవారం బహిష్కరించారు. వీకే పాండ్యన్ బావమరిది అని చెప్పుకొని ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పిన రమేష్ రౌత్ అనే వ్యక్తితో కలిసి సుస్మితా డబ్బులు వసూలు చేసిన విషయం తెలిసిందే. దీంతో ఆమెను పార్టీని నుంచి బహిష్కరించినట్లు బీజేడీ వర్గాలు పేర్కొన్నాయి.

పంచాయతీ భవనం ప్రారంభం



పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తారాప్రసాద్

జయపురం: సమితి పరిధి హడియ గ్రామంలో పంచాయతీ భవనాన్ని ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవనం ఏర్పాటుతో ఈ పంచాయతీ ప్రజల చిరకాల కోరిక తీరిందన్నారు. దీనికోసం రూ.10 లక్షల పంచాయతీ నిధులు వెచ్చించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో బీడీవో శక్తి మహాపాత్రో, సమితి అధ్యక్షురాలు తిలోత్తమ ముదులి, సర్పంచ్ సుభద్ర పూజారి తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల సమస్యలపై ప్రభుత్వానికి నివేదిక



గిరిజనుల సమస్యలపై మాట్లాడుతున్న ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్య శంకర్‌నాయక్

జలుమూరు: మండలంలోని మర్రివలస పంచాయతీ పరిధిలోని ఎస్టీ మాకివలస గిరిజనుల సమస్యలపై ప్రభుత్వానికి నివేదించనున్నామని ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్య శంకర్ నాయక్ అన్నారు. మంగళవారం ఎస్టీ మాకివలసలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీల జోలికి వస్తే సహించేది లేదన్నారు. ఆదివాసీల హక్కులకు భంగం కలిగించేలా 'హరే రామ హరే కృష్ణ' సంస్థ వ్యవహరించడం సరికాదని పేర్కొన్నారు. అనంతరం స్థానికులు మాట్లాడుతూ కనీస వసతులైన తాగునీరు, సీసీ రోడ్లు, ఇళ్లు లేక ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాబ యోగీశ్వరరావు మాట్లాడుతూ మూడు తరాలుగా సాగు చేసుకున్న వ్యవసాయ పొలాలను అన్యాయంగా వేరొకరికి అమ్మకాలు చేయడంతో జీవనాధారం కోల్పోయినట్లు తెలిపారు. గ్రామం ఏర్పడి సుమా రు 80 ఏళ్లు దాటుతోందని, అప్పటి తమ భూముల రికార్డులను తారుమారు చేసి ఓ వ్యక్తి ఎక్కువ భూమి కలిగి ఉన్నా అధికారులు ల్యాండ్ సీలింగ్ చట్టం కింద కేసులు నమోదు చేయలేదని వివరించారు. గిరిజనుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని సాగుహక్కులో ఉన్న భూములను పెత్తందార్లు వేరొకరికి అమ్మకాలు చేయడం తమ పొట్టడమే అని వారు వాపోయారు.

రెవెన్యూ అధికారులపై అసహనం..

ప్రధానంగా రెవెన్యూ శాఖకు సంబంధించి భూములపై ఇక్కడ వివాదం నడుస్తుంటే ఆ శాఖ తహసీల్దార్, డీటీ, ఆర్ఐలు హాజరుకాకపోవడంపై వడిత్య శంకర్ నాయక్ అసహనం వ్యక్తం చేశారు. ముందుగా జలుమూరు తహసీల్దార్ లక్ష్మీనారాయణకు ఫోన్‌లో మాట్లాడగా కోర్టు పని వల్ల హాజరు కాలేదని వివరించారు. కనీసం డీటీ, ఆర్ఐ స్థాయి అధికారులైనా హజరై భూములు వివరాలు చెప్పాల్సిన బాధ్యత లేదా అని మండిపడ్డారు. అనంతరం పలువురు గిరిజనులు కమిషన్ సభ్యులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ విస్తరణ అధికారి ఉమామహేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

సాధారణ ప్రసవాలు పెంచాలి

టెక్కలి రూరల్: టెక్కలి జిల్లా ఆస్పత్రిలో సాధారణ ప్రసవాల సంఖ్య పెంచాలని ఏపీ స్టేట్ డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ కమిషనర్ అట్టాడ సిరి సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం టెక్కలి జిల్లా ఆస్పత్రిని ఆకస్మికంగా సందర్శించారు. వార్డులు, సీటీ స్కాన్ విభాగాన్ని పరిశీలించి రోగులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గర్భిణులకు నార్మల్ డెలివరీపై అవగాహన కల్పించాలన్నారు. ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టులను భర్తీ చేస్తామని చెప్పారు. మందుల కొరత లేకుండా చూస్తామన్నారు. ఆస్పత్రిలో రిఫరల్ సంఖ్య తగ్గించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. టెక్కలి జిల్లా ఆస్పత్రికి 200 పడకల సామర్థ్యముందని, ప్రస్తుతానికి 100 మాత్రమే ఉన్నాయని, వాటిని పెంచేందుకు కృషి చేస్తామని వివరించారు. కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ రాజ్యలక్ష్మి, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి.సూర్యారావు, ఆర్ఎంవో డాక్టర్ మహారాజ్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

'పింఛన్‌పై బీజేపీ మాట మార్చింది'



మాట్లాడుతున్న మాజీమంత్రి రబినారాయణ నందో



బీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

జయపురం:

రాష్ట్రంలోని బీజేపీ ప్రభుత్వం పింఛన్ హామీని తుంగలో తొక్కిందని మాజీ మంత్రి రబినారాయణ నందో ధ్వజమెత్తారు. ఆయన నేతృత్వంలో బీజేడీ శ్రేణులు జయపురం బీడీవో కార్యాలయాన్ని మంగళవారం ముట్టడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు రూ.3000 పింఛన్ అందిస్తామని చెప్పి బీజేపీ అధికారంలోకి వచ్చిందని గుర్తు చేశారు. అయితే అధికారంలోకి వచ్చాక పింఛన్‌పై మాట మార్చిందని మండిపడ్డారు. రూ.3 వేల పింఛన్‌ను 80 ఏళ్లు పైబడినవారికి మాత్రమే ఇస్తామని, మిగితావారికి రూ.1 వేయి మాత్రమే ఇస్తామని సీఎం ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రాష్ట్రంలో 56 లక్షల మంది పెన్షన్‌దారులుండగా, రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో కేవలం 5 లక్షల మంది మాత్రం లబ్ధి పొందుతారని వెల్లడించారు. బీజేపీ ఇచ్చిన హామీ వలన ఓటు వేసిన 51 లక్షల మంది మోసపోతున్నారని పేర్కొన్నారు. వెంటనే లబ్ధిదారులందరికీ రూ.3 వేల పింఛన్ అందజేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ముఖ్యమంత్రికి ఉద్దేశించిన వినతిపత్రం బీడీవో శక్తి మహాపాత్రోకు అందజేశారు. ఆందోళనలో అనూప్ కుమార్ పాత్రో తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదానికి గురై.. గంజాయితో పట్టుబడి



ప్రమాదానికి గురై పక్కకు ఒరిగిపోయిన ట్రక్కు



పట్టుబడిన గంజాయి బస్తాలు

జయపురం: అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న ఒక ట్రక్కు ప్రమాదానికి గురై పోలీసులకు పట్టుబడింది. వివరాల్లోకి వెళ్తే.. సోమవారం రాత్రి 9 గంటల సమయంలో బొయిపరిగుడ–జయపురం బైపాస్ రోడ్డులో ఆరు చక్రాల ట్రక్కు చరకాపుట్ గ్రామ సమీపంలో ప్రమాదానికి గురై పక్కకు ఒరిగిపోయింది. ప్రమాద సమాచారం అందిన వెంటనే బొయిపరిగుడ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. అయితే అక్కడ వారికి ప్రమాదానికి గురైన ట్రక్కులో గంజాయి బస్తాలు కనిపించాయి. దీంతో పోలీసులు గంజాయి బస్తాలతో కలిపి ట్రక్కుని సీజ్ చేశారు. ప్రమాదం జరిగిన తర్వాత పోలీసుల రాకను ముందే కనిపెట్టి గంజాయి మాఫియ వ్యక్తులు పరారైనట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. గంజాయి తూయించగా 760 కేజీలు ఉందని, దీనివిలువ సుమారు రూ.80 లక్షలు ఉంటుందని పేర్కొన్నారు. ఘటనా స్థలం వద్ద ఎవరూ లేకపోవడం వలన వివరాలు ఏమీ తెలియలేదు. పోలీసులు ఈ కేసు దర్యాప్తు చేసేందుకు ఒక టీమ్‌ను ఏర్పాటు చేసినట్లు సమాచారం.

కాంగ్రెస్ కార్యకర్తలకు శిక్షణ శిబిరం



శిక్షణలో పాల్గొన్న కాంగ్రెస్ కార్యకర్తలు

కొరాపుట్: పంచాయతీ రాజ్ వ్యవస్థపై కాంగ్రెస్ పార్టీ శిక్షణ శిబిరం ప్రారంభించింది. కొరాపుట్ జిల్లా కేంద్రంలోని ట్రైబల్ మ్యూజియంలో రాజీవ్ గాంధీ పంచాయతీ రాజ్ సంఘటన జాతీయ ఉపాధ్యక్షుడు కునాల్ బెనర్జి మంగళవారం ప్రారంభించారు. గ్రామీణ స్థాయిలో పంచాయతీ రాజ్ వ్యవస్థపై అవగాహన కోసం రెండు రోజుల శిక్షణ శిబిరం నిర్వహించనున్నారు. రంజన్ గగోయి (జార్ఖండ్), సుదర్శన్ దాస్‌లు శిక్షకులుగా వ్యవహరిస్తారు.

గుర్తింపు కార్డులు అందజేత



గుర్తింపు కార్డులు అందజేస్తున్న దృశ్యం

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లా డాబుగాం పోలీసులు సీనియర్ సిటిజన్లకి గుర్తింపు కార్డులు అందజేశారు. మంగళవారం పోలీస్‌స్టేషన్ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ఉమ్మర్‌కోట్ ఎస్‌డీపీవో మధుసిక్త మిశ్ర మాట్లాడుతూ ఈ గుర్తింపు కార్డుల వలన వయో వృద్ధులకు అనేక ప్రయోజనాలు ఉంటాయన్నారు. వీరందరూ సమాజం మీద బాధ్యత వహిస్తూ పోలీసులకు తగు సహాయం చేస్తారన్నారు. బాల్య వివాహాలపై అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు. సామాజిక కార్యక్రమాల నిర్వహణకు కృషి చేస్తారన్నారు. పోలీసులకు, ప్రజలకు మధ్య సమన్వయం చేస్తూ శాంతి భద్రతలకు సహకరిస్తారని తెలిపారు. కార్యక్రమంలో డాబుగాం పోలీస్ అధికారి సునీల్ కుమార్ ప్రధాన్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడికి అభయమిచ్చిన ఎస్పీ



మాధవయ్య సమస్య వింటున్న ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైమ్ : యువ ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డికి వృద్ధులంటే మమకారం అన్న విషయం మరోసారి స్పష్టమైంది. ప్రతి సోమవారం జరిగే మీకోసం వేదికలో వృద్ధుల కోసం బయటకొచ్చి మరీ ఓపికగా సమస్యలు వింటున్నారనే చర్చ ఇప్పటికే ఉంది. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయానికి ఎస్పీ వచ్చిన సమయంలో.. కాలు లేని వృద్ధ దివ్యాంగుడు పైలా మాధవయ్య దీనంగా కూర్చుండటం చూశారు. వెంటనే అతని వద్దకు వెళ్లి సమస్యపై ఆరా తీశారు. తనది ఎల్ఎన్‌పేట మండలం కోవిలం గ్రామమని, నిరుపేద కుటుంబమని, నాటుకోళ్ల క్రయ విక్రయాలు చేస్తూ జీవనం సాగిస్తున్నానని చెప్పాడు. తమ గ్రామానికే చెందిన ఓ వ్యక్తి తన నాటుకోళ్లను దొంగిలించాడని.. ఈ విషయంపై సరుబుజ్జిలి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని.. అక్కడి పోలీసులు పట్టించుకోకపోవడంతో మీ బాధ చెప్పుకునేందుకు వచ్చానని బదులిచ్చాడు. వెంటనే ఎస్పీ స్పందించి సరుబుజ్జిలి ఎస్ఐతో ఫోన్లో మాట్లాడారు. మాధవయ్య సమస్యను పరిష్కరించి, కోళ్లు అపహరించిన వ్యక్తితో బాధితునికి నష్టపరిహారాన్ని ఇప్పించాలని ఆదేశించారు.

ఫిలిం చాంబర్స్ ఆఫ్ కామర్స్ కార్యవర్గ ఎన్నిక

పలాస: మన ఫిలిం ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ రాష్ట్ర అధ్యక్షుడు జె.ఎస్.రాజేంద్ర ఆదేశాల మేరకు జిల్లా శాఖ నూతన కార్యవర్గ ఎన్నిక పలాసలో మంగళవారం ఏకగ్రీవం జరిగింది. జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ కుమార్‌నాయక్, గౌరవ అధ్యక్షుడిగా తెప్పల కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శిగా డి.ఎ.స్టాలిన్, కోశాధికారిగా బమ్మిడి కృష్ణారావు, ఉపాధ్యక్షులుగా మద్దు ఈశ్వరమ్మ, సంయుక్త కార్యదర్శులుగా బమ్మిడి రుక్మాంగదరరావు, తంగి శోభారాణి, మరో ఏడుగురిని సభ్యులుగా ఎన్నుకున్నారు.

29న వ్యవసాయ యాంత్రీకరణ మేళా

శ్రీకాకుళం రూరల్ : రాగోలులో ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ పరిశోధన స్థానంలో ఈ నెల 29న యాంత్రీకరణ మేళా నిర్వహించనున్నట్లు సంచాలకుడు డాక్టర్ పి.వి.సత్యనారాయణ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

10న జిల్లాస్థాయి పోటీలు

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని ఈదుపురం బేతాళ యువజన సంఘం 23వ వార్షికోత్సవం సందర్భంగా జిల్లా స్థాయి క్విజ్, చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబర్ 10న 8,9,10 తరగతుల విద్యార్థులకు క్విజ్ పోటీలు జరుగుతాయని, వివరాలకు 9000045663, 9110784445 నంబర్లకు సంప్రదించాలని కోరారు.

ఖాళీ సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్లలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల/కళాశాలలో ఖాళీ సీట్ల భర్తీకి విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎస్.పద్మజ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐదో తరగతిలో 2, ఆరో తరగతిలో 3, ఎనిమిదో తరగతిలో 2, ఇంటర్మీడియట్ మొదటి ఏడాది ఎంపీసీలో 11, బైపీసీలో 2 సీట్లు చొప్పున ఖాళీగా ఉన్నట్లు వివరించారు. ఈ నెల 30న ప్రతిభా పరీక్ష నిర్వహించి సీట్లు కేటాయిస్తామని తెలిపారు. ఆధార్ జిరాక్స్, మార్కుల ధ్రువపత్రాలతో హాజరుకావాలని కోరారు.

గల్లంతైన యువకుడు మృతి

హిరమండలం: తల్లి మందలించిందని వంశధార కుడికాలువలో దూకేసిన జోగి దుర్గప్రసాద్ (22) మంగళవారం శవమై తేలాడు. స్థానిక మైత్రీకాలనీలో జోగి సావిత్రమ్మ అనే మహిళ తన ఇద్దరు కుమారులతో కలిసి నివాసముంటోంది. పెద్ద కుమారుడు దుర్గాప్రసాద్ వ్యాన్ క్లీనర్‌గా పనిచేస్తున్నాడు. చిన్నప్పుడే తండ్రి చనిపోవడంతో తల్లి అన్నీతానై పెంచింది. ఇటీవల దుర్గాప్రసాద్ మద్యానికి బానిస కావడంతో వద్దని వారించింది. సోమవారం మద్యం తాగి రావడంతో మందలించింది. దీంతో మనస్తాపానికి గురైన దుర్గాప్రసాద్ సాయంత్రం వంశధార కాలువలో దూకేశాడు. దీంతో పోలీసులు, కుటుంబసభ్యులు వెతికారు. రాత్రి కావడంతో గాలింపు చర్యలు నిలిపివేశారు. మంగళవారం ఉదయం పెద్దకోరాడ సమీపంలోని వంతెన వద్ద మృతదేహం బయటపడింది. దీంతో తల్లి సావిత్రమ్మ, సోదరుడు శంకర్ గుండెలవిసేలా రోదించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాతపట్నం సీహెచ్‌సీకి తరలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ నారాయణస్వామి తెలిపారు.

'రెవెన్యూ'లో బదిలీల సందడి

- అన్ని స్థాయిల ట్రాన్స్‌ఫర్లకు సిపారసు లేఖలు!
- ఇటీవల పోస్టింగ్ ఇచ్చిన తహసీల్దార్లకూ తప్పని స్థానచలనం



శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా రెవెన్యూ విభాగంలో బదిలీల సందడి నెలకొంది. మరో మూడు రోజులు మాత్రమే గడువు ఉన్నందున ఉద్యోగులు వారికి కావాల్సిన చోటు కోసం కుస్తీ పడుతున్నారు. వీఆర్వో నుంచి తహసీల్దారు వరకు అన్ని కేడర్లకు ఒకేసారి బదిలీకి అవకాశం ఇవ్వడం, సర్వీసుతో పనిలేకుండా 'జీరో' సర్వీసును పరిగణనలోకి తీసుకోవడం, ఒకేచోట ఐదేళ్లు పనిచేసిన వారికి బదిలీ తప్పనిసరి చేయడంతో రెవెన్యూ శాఖలో కోలాహలం నెలకొంది. రిటైర్‌మెంట్‌కు దగ్గరలో ఉన్న వారికీ సమస్య తప్పడం లేదు.

నేతల చుట్టూ ప్రదక్షిణలు..

మంత్రి, శాసన సభ్యుల సిపారసు లేఖలు ఉన్నవారికి కావాల్సిన చోట పోస్టింగ్ ఇవ్వడంలో ప్రాధాన్యత కల్పించడంతో ఉద్యోగులు నాయకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. కొందరు నేతలు సిపారసు లేఖకు సైతం రేటు నిర్ణయించినట్లు ప్రచారం జరుగుతోంది. ఇదే అదునుగా వీఆర్వో నుంచి తహసీల్దారు వరకు కేడరు బట్టి రూ.50 వేలు నుంచి రూ.లక్షల్లో వసూలు జరుగుతున్నట్లు సమాచారం. వీఆర్ఓ పోస్టింగ్ కావాలంటే ఆ గ్రామ టీడీపీ కార్యకర్తల సిఫారసు తప్పనిసరిగా ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. వీరిని కాదని ఎమ్మెల్యే వద్దకు వెళ్లినా ఆ గ్రామం కార్యకర్తల సిఫారసు ఉండాలని తిప్పి పంపించేస్తున్నారు. దీంతో గ్రామ స్థాయి కార్యకర్తలు సైతం వసూళ్లు చేస్తున్నారని వీఆర్ఓలు ఆందళన వ్యక్తం చేస్తున్నారు. ఇక ఇతర కేడర్ల ఉద్యోగులకు మండల స్థాయి నాయకుల సిఫారసు లేకపోతే బదిలీ పోస్టింగ్ ఇచ్చే పరిస్థితి లేదు.

అధిక సంఖ్యలో బదిలీలు..

ఈసారి 'జీరో' సర్వీసును పరిగణనలోకి తీసుకోవడంతో ఎక్కువ సంఖ్యలో బదిలీలు జరగనున్నాయి. ప్రధానంగా వీఆర్వోలు, డీటీలు, సీనియర్ అసిస్టెంట్లు, ఆర్ఐలు బదిలీలు కానున్నారు. వీఆర్వోల బదిలీల దరఖాస్తులు గడువు పూర్తయింది. మిగిలిన కేడర్లు వారు ఈ నెల 29 వరకు దరఖాస్తు చేసుకొనే వెసులుబాటు ఉన్నందున, ఇంకా సిపార్సు లేఖలు కూడా పూర్తి స్థాయిలో అందనందున ఈ బదిలీలు జాప్యం అయ్యే పరిస్థితి నెలకొంది. ఇక ఐదేళ్లు ఒకే చోట పనిచేసిన వారికి బదిలీ తప్పనిసరి కానుంది. దీంతో కలెక్టరేట్‌లో ఎక్కువ మంది బదిలీ అయ్యే అవకాశం ఉంది. ఇటీవల ఎన్నికల విధుల్లో ఇతర జిల్లాలకు వెళ్లిన వారు అక్కడ సర్వీసును బదిలీలకు పరిగణనలోకి తీసుకోవడంలేదు. దీంతో ఎన్నికల ముందు వారు పనిచేసిన చోట ఐదేళ్లయితే తప్పనిసరిగా ట్రాన్స్‌ఫర్ కావాల్సి ఉంటుంది. ఇలా కలెక్టరేట్‌లో ఇటీవల వచ్చిన తహసీల్దార్లు ముగ్గురు బదిలీ కావాల్సి ఉంది. ఈ ప్రక్రియ పూర్తి చేసేందుకు కలెక్టరేట్ ఉద్యోగులు కుస్తీలు పడుతున్నారు.

కొరాపుట్‌లో గ్రీవెన్స్ సెల్



పపడాహండిలో ట్రై సైకిల్స్ అందజేస్తున్న దృశ్యం

కొరాపుట్: కొరాపుట్, నబరంగ్‌పూర్ జిల్లాల్లో ఆయా జిల్లాల కలెక్టర్లు గ్రీవెన్ సెల్ నిర్వహించారు. వాస్తవానికి ప్రతీ సోమవారం కలెక్టర్లు రాష్ట్రవ్యాప్తంగా గ్రీవెన్స్ సెల్ నిర్వహించాల్సి ఉంది. కానీ సోమవారం కృష్ణాష్టమి నేపథ్యంలో ప్రభుత్వం సెలవు ఇచ్చినందున మంగళవారం గ్రీవెన్స్ చేపట్టారు. నబరంగ్‌పూర్ జిల్లా పపడాహండి సమితి కార్యాలయంలో కలెక్టర్ శుభంకర్ మహాపాత్రో హాజరయ్యారు. దీనిలో 43 వినతులు ప్రజలు అందజేయగా, అందులో 31 వ్యక్తిగత, 12 సామాజిక సమస్యలు ఉన్నాయి. అందులో ఒక్క సమస్య అక్కడికక్కడే పరిష్కరించారు. 25 మందికి మధు బాబు పింఛన్ కార్డులు, ముగ్గురు దివ్యాంగులకు ట్రై సైకిళ్లని పంపిణీ చేశారు. కార్యక్రమంలో నబరంగ్‌పూర్ జిల్లా ఎస్పీ రోహిత్ వర్మ హాజరయ్యారు. కొరాపుట్ జిల్లా సిమిలిగుడ సమితి కేంద్రంలో కొరాపుట్ జిల్లా కలెక్టర్ వి.కీర్తి వాసన్ గ్రీవెన్ సెల్ నిర్వహించి ప్రజా సమస్యలు పరిష్కరించారు.

పశువుల వ్యాపారులపై దాడులు తగవు



ర్యాలీ నిర్వహిస్తున్న పశువుల వ్యాపారులు

కొరాపుట్: పేద పశువుల వ్యాపారులపై స్మగ్లర్ల పేరుతో దాడులు చేయడం తగదని పలువురు పేర్కొన్నారు. ఈ మేరకు నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలో వ్యాపారులు భారీ ర్యాలీ నిర్వహించారు. వంశపారపర్యంగా తాము పశువులు కొనడం, అమ్మడం చేస్తున్నామన్నారు. వీటి క్రయ విక్రయాల కోసం రవాణా చేయడం సహజమన్నారు. తమకు పశువుల వ్యాపారం కోసం రాజ్యాంగపరంగా హక్కులు ఉన్నాయన్నారు. కానీ కొన్ని శక్తులు మాత్రం తమ వంటి వ్యాపారులపై దాడులు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గోహత్య, గో మాంసం విక్రయించడానికి సహకరిస్తున్నామని నిందలు వేస్తున్నారని వాపోయారు. అలాంటి పనులు చేసే వారిపై చర్యలు తీసుకోవాలని, కానీ తమ వంటి వ్యాపారులపై దాడులు చేయడం తగదన్నారు. రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ఈ దాడులు అధికమయ్యాయని ఆరోపించారు. వీటిని అరికట్టాలని డిమాండ్ చేస్తూ జిల్లా కలెక్టర్, ఎస్పీలకు వినతిపత్రం అందించారు. ఈ ర్యాలీ చమిరియాగుడ నుంచి మెయిన్ రోడ్డు మీదుగా కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు.

ముగిసిన ప్రైవేటు బస్సుల బంద్



బస్టాండ్‌లో నిరసన తెలుపుతున్న దృశ్యం

మల్కన్‌గిరి: జిల్లాలో ప్రైవేట్ బస్సు యాజమానులు మంగళవారం చేపట్టిన ప్రైవేట్ బస్సుల బంద్ ముగిసింది. మల్కన్‌గిరి జిల్లా కేంద్రం నుంచి సమితుల్లో నడుస్తున్న లక్ష్మీ ఏసీ బస్సులు వలన ప్రైవేట్ బస్సు యజమానులకు నష్టాలు వస్తున్నాయి. అందువలన వీటిని రద్దు చేయమని కోరుతూ ఒక్కరోజు బంద్ చేపట్టారు. కార్యక్రమంలో జిల్లా ప్రైవేట్ బస్సు యజమానుల సంఘం అధ్యక్షురాలు రాజేశ్వరీ ప్రధాన్, సెక్రటరీ టి.వెంకట్‌రావు, సపాన్ దాత్తో, సుబ్బారావు పాత్రో, సీహెచ్ రాజేష్ పాత్రో, దిలిప్ కుమార్ హిండియా, కేదారనాథ్ దాస్, జి.సీతారామయ్య, రవి ఖాన్, చోబిదాస్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పూజలు



పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అనిల్ కుమార్ తదితరులు

కొరాపుట్: బ్రహ్మపుర ఎమ్మెల్యే కె.అనిల్ కుమార్ ముక్తేశ్వర దేవాలయాన్ని మంగళవారం సందర్శించారు. దీనిలో భాగంగా ఆలయం ఆవరణలో నూతనంగా నిర్మించిన కార్యాలయ భవనాన్ని ప్రారంభించారు. అనంతరం వేద పండితులు ఎమ్మెల్యేతో ప్రత్యేక పూజలు చేయించారు. అంతకుముందు కస్పా వీధిలో మహురి రాజా జగన్నాథ దేవాలయం, బిజిపూర్‌లోని బోర్డింగ్ వీధిలో జరిగిన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కార్యక్రమాల్లో బీజేపీ అధికార ప్రతినిధి టి.గోపి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి కార్మికుల ఆందోళన



కొరాపుట్ రైల్వేస్టేషన్ వద్ద నినాదాలు చేస్తున్న కార్మికులు

కొరాపుట్: రాజధాని భువనేశ్వర్‌లోని అసెంబ్లీ ఎదుట బుధవారం నుంచి ఆందోళనలు చేపట్టాలని జయపూర్ పట్టణ సమీపంలో గగనాపూర్ వద్దనున్న పేపర్ మిల్లులో పని చేస్తున్న కార్మికులు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. మంగళవారం రాత్రి కొరాపుట్ రైల్వేస్టేషన్ నుంచి వీరంతా హిరాఖండ్ రైలులో భువనేశ్వర్ బయల్దేరారు. బుధవారం, గురువారం ఈ ఆందోళనలు కొనసాగనున్నాయి. ఈ మేరకు కార్మిక నాయకుడు ప్రమోద్ మహంతి కొరాపుట్ రైల్వేస్టేషన్ వద్ద మీడియాతో మాట్లాడారు. పేపరు మిల్లు మూతపడడంతో తమకు గత 6 నెలలుగా జీతాలు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పదవీ విరమణ పొందినవారికి, మరణించిన వారికి ఎటువంటి పరిహారాలు అందడం లేదన్నారు. పీఎఫ్, పెన్షన్ బకాయిలు కొనసాగుతున్నాయని వాపోయారు. తమకు న్యాయం చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ, ఇతర మంత్రులను కలిసి వినతిపత్రాలు అందజేస్తామని తెలిపారు. ట్రైన్‌లో బయల్దేరినవారిలో బసంత్ బెహరా, సుభాష్ బెహరా, ఉమా శంకర్ సత్పతి తదితరులు ఉన్నారు.

నేత్రదానంపై అవగాహన ర్యాలీ



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఫ్రెండ్స్ హెల్పింగ్ క్లబ్ సభ్యులు

కొరాపుట్: బ్రహ్మపుర నగరంలో పార్క్ స్ట్రీట్ నుంచి ఎస్ఎస్‌టీ రోడ్డు వరకు నేత్రదానంపై అవగాహన ర్యాలీ మంగళవారం నిర్వహించారు. ఫ్రెండ్స్ హెల్పింగ్ క్లబ్ సభ్యులు మొత్తం 15 రోజుల పాటు వివిధ ప్రాంతాల్లో అవగాహన కల్పించనున్నారు. ర్యాలీలో భాగంగా పాదచారులకు కరపత్రాలు పంచుతూ నేత్రదానం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో క్లబ్ ప్రాజెక్ట్ చైర్మన్ బి.లక్ష్మీ నారాయణ పాత్రో, అధ్యక్షుడు విద్యాసాగర్, కార్యదర్శి సత్యకం పాత్రో, మాజీ అధ్యక్షుడు ప్రశాంత్ పాత్రో, వారణాసి సత్యనారాయణ, కొంచాడ పురుషోత్తం కుమార్ సుబుద్ధి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఘనంగా గోపూజోత్సవం



గో పూజోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

విజయనగరం టౌన్: తిరుమల తిరుపతి దేవస్థానములు, హిందూ ధర్మ ప్రచార పరిషత్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో స్థానిక టీటీడీ కల్యాణ మండపం ఆవరణలో మంగళవారం గోకులాష్టమి పర్వదినం పురస్కరించుకుని గోపూజోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. టీటీడీ ప్రోగ్రామింగ్ మేనేజర్ జె.శ్యామ్‌సుందరం ఆధ్వర్యంలో అర్చకులు పీవీ నరసింహాచార్యులు గోపూజోత్సవాన్ని నిర్వహించారు. తిరుమల నుంచి వచ్చిన ప్రతినిధులు, శ్రీకాకుళం, విశాఖ నుంచి వచ్చిన ధర్మప్రచార పరిషత్ సభ్యులు, టీటీడీ ప్రతినిధులు ఎంకెవి.సత్యన్నారాయణ, సిహెచ్.సత్యనారాయణ, సిహెచ్.ప్రసాద్, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ పోటీల న్యాయ నిర్ణేతగా జ్వాలాముఖి



కేవీ జ్వాలాముఖి

విజయనగరం: జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో జరిగే చెస్ పోటీలకు న్యాయ నిర్ణేతగా విజయనగరం జిల్లాకు చెందిన కేవీ జ్వాలాముఖి అర్హత సాధించారు. ఇటీవల తిరుపతిలో ఫిడే ఆర్బిటర్ సెమినార్‌లో నిర్వహించిన అర్హత పరీక్షలో పాల్గొన్న జ్వాలాముఖి అందులో ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్నేషనల్ చెస్ ఫెడరేషన్ కౌన్సిల్ ఆమోదంతో ఫిడే ఆర్బిటర్ టైటిల్‌ను అందుకున్నట్లు ఆయన ఒక ప్రకటనలో మంగళవారం తెలిపారు. ప్రస్తుతం ఆయన చెస్ అసోసియేషన్ ఆఫ్ విజయనగరం జిల్లా కార్యదర్శిగా, రాష్ట్ర చెస్ అసోసియేషన్ కోశాధికారిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అంతర్జాతీయ చెస్ పోటీల న్యాయ నిర్ణేతగా ఆయన ఎంపిక కావడం పట్ల చెస్ అసోసియేషన్ ఆఫ్ విజయనగరం ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య



ఆత్మహత్యకు పాల్పడిన శంకరరావు

నెల్లిమర్ల: నగర పంచాయతీ పరిధిలోని థామస్‌పేటకు చెందిన అంతరపల్లి శంకర్రావు(30) మంగళవారం ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనిపై మృతుడి తండ్రి ఫిర్యాదులో శంకర్రావు తరచూ భార్యతో గొడవలు పడి పలుమార్లు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడినట్లు పేర్కొన్నాడు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు. ఫిర్యాదు మేరకు ఎస్సై డి.రామగణేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

850 మద్యం సీసాలు ధ్వంసం



మద్యం సీసాలను ధ్వంసం చేస్తున్న పోలీసులు

భోగాపురం: పూసపాటిరేగ, భోగాపురం మండలాల్లో ఇంతవరకు అక్రమంగా మద్యం తరలిస్తూ, బెల్ట్ షాపుల ద్వారా మద్యం విక్రయిస్తున్న వారి నుంచి స్వాధీనం చేసుకున్న 850 మద్యం సీసాలను మంగళవారం ధ్వంసం చేశారు. ఎస్పీ వకుల్ జిందాల్ ఉత్తర్వుల మేరకు భోగాపురం స్టేషన్‌లో ఎస్ఈబీ సీఐ బీవీజీ రాజు, ఎస్‌హెచ్‌ఓ ప్రభాకర్ ఆధ్వర్యంలో సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు సాహిత్య పరిశోధకుడు ముత్యం



ముత్యం సంస్మరణ సభలో మాట్లాడుతున్న అరసం ప్రతినిధులు

విజయనగరం టౌన్: కళింగాంధ్రా సాహిత్య పరిశోధనకు, శ్రీకాకుళం సాయుధ పోరాటాన్ని, ఆ పోరాటంలో పాల్గొన్న యోధుల చరిత్రను ఎన్నో వ్యయప్రయాసలకు ఓర్చి సేకరించి, పుస్తక రూపంలో తీసుకువచ్చిన ప్రముఖ రచయిత, కళింగాంధ్రా సాహిత్య పరిశోధకులు కె.ముత్యం చిరస్మరణీయుడని అరసం జిల్లా అధ్యక్షుడు జీఎస్.చలం పేర్కొన్నారు. గురజాడ స్వగృహంలో మంగళవారం రాత్రి ముత్యం సంస్మరణ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళింగాంధ్రా చరిత్రకు ఎనలేని సేవలు చేసి, తన జీవితాన్ని కళింగాంధ్రకు అంకితం చేసిన మహానుభావుడని కీర్తించారు. అరసం ప్రధాన కార్యదర్శి రత్నాల బాలకృష్ణ మాట్లాడుతూ తెలంగాణా బిడ్డగా జన్మించిన తన జీవితం చివరిబొట్టు వరకూ కళింగాంధ్రా చరిత్రను, ఆనాడు బ్రిటీష్ వారు సేకరించిన గ్రామాల చరిత్రను సేకరించి ఉత్తరాంధ్ర ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారన్నారు. కార్యక్రమంలో రెడ్డి శంకరరావు, చీకటి దివాకర్, గురజాడ ఇందిర, డప్పు శ్రీను, స్వామి, పివిబి.శ్రీనివాస్, జివి.శ్రీనివాస్, జి.జయపాల్ తదితరులు పాల్గొన్నారు.

తగ్గేదేలే..!



రామభద్రపురంలో భర్తతో కలిసి కూరగాయలను మార్కెట్ తీసుకువెళ్తున్న మహిళ



చిక్కుడు మొక్కలకు పురుగు నివారణ మందు పిచికారీ చేస్తున్న మహిళా రైతు

- మహిళా రైతులదే కీలక ప్రాత్ర
- వ్యవసాయ పనుల్లో భర్తలకు చేదోడు
- ఆర్థికాభివృద్ధిలో ప్రధాన భూమిక



వరి నారు తీస్తున్న మహిళా కూలీలు

రామభద్రపురం: గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ రంగంలో మహిళా రైతులు కీలక పాత్ర పోషిస్తున్నారు. ప్రత్యక్షంగాను, పరోక్షంగా వ్యవసాయ పరిశ్రమ, పాడి పరిశ్రమలో వారి పాత్ర నానాటికీ పెరుగుతోంది. రామభద్రపురం మండలంలో దాదాపు 70 శాతం మంది మహిళలే రైతులు, రైతు కూలీలు. వారు భూమిని సాగుకు సిద్ధం చేసే దగ్గర నుంచి విత్తనాలు నాటి, పంటలను మార్కెట్‌లో విక్రయించేంతవరకు అన్ని పనుల్లోనూ అధికంగా కష్టపడుతున్నారు. పంటల సాగులో ఉన్న కలుపు తీయాలన్నా, కూరగాయ పంటలైతే మార్కెట్‌కు తీసుకెళ్లాలన్నా, మహిళా రైతులు, రైతు కూలీలే ఉండాలి. వ్యవసాయ రంగం, పాడి రంగంపై ఆధారపడి జీవనం సాగిస్తూ ఆర్థికాభివృద్ధిలో ప్రధాన భూమిక పోషిస్తున్న వారిలో మహిళా రైతులు, రైతు కూలీలే ఎక్కువ. భర్తతో సమానంగా తెలవారు జామున పొలం పనికి వెళ్లి కూరగాయలు, వరి, పత్తి, పాడి వంటి పంటలలో పనులు చేసుకుని ఇంటికి వచ్చి వంట చేసి, పిల్లలను పాఠశాలలకు సిద్ధం చేసి పంపిస్తారు. మళ్లీ భర్తతో కలిసి పొలం పనులకు వెళ్లిపోతారు. మండలంలో ఉన్న వ్యవసాయ భూమిలో 60 శాతం వరకు మహిళలే స్వయంగా సాగు చేస్తున్నారు.ఉన్న చిన్నచిన్న కమతాలతోను, ఒకటి లేక రెండు పాడి ఆవులతోను ఆర్థికంగా అభివృద్ధి చెందుతూ పిల్లల చదువుల దగ్గర నుంచి ఆడపిల్లలకు పెళ్లి చేసేంత వరలకు మహిళా రైతులదే కీలక పాత్ర. పాడి పశువులు ఉంటే పశుగ్రాసం సేకరణ నుంచి పాలు పితికి పాల సొసైటీకి సరఫరా చేసినంతవరకు పురుషులే కాదు మేము కూడా వ్యవసాయ, పాడి రంగాల్లో దూసుకుపోగలం అని మహిళా రైతులు నిరూపిస్తున్నారు.



తారాపురంలో పాలు పితుకుతున్న మహిళా పాడి రైతు

పాడితో ఆర్థికంగా ఎదిగాం



గతంలో నాకు అర ఎకరా భూమి మాత్రమే ఉండేది.దాంతో పాటు రెండు ఆవులు ఉండేవి. ఎకరా భూమిలో పశుగ్రాసం సాగు చేసుకుంటూ, పాడి ఆవులను పెంచాం. పాలు సరఫరా చేస్తూ ఆర్థికంగా అభివృద్ధి చెందాం. పాడి ఆవుల పాల ఆదాయంతోనే పిల్లలను చదివించుకుంటూ ఎకరా భూమి కొనుగోలు చేశాం. ఒక ఇల్లు కట్టుకున్నాం.

– అర్నిపల్లి ఈశ్వరమ్మ, మహిళా పాడి రైతు, నాయుడువలస.

వ్యవసాయంతోనే అబివృద్ధి చెందాం



వ్యవసాయంతోనే ఆర్థికాభివృద్ధి సాధించాం .గతంలో మాకున్న తక్కువ భూమిలో కూరగాయలు సాగు చేసేవాళ్లం, పిల్లలను చదివిస్తూ కుటుంబ జీవనం సాగించే వారం. వ్యవసాయం వల్లనే 2 ఎకరాల భూమి కొనుగోలు చేశాం. కుమార్తెకు వివాహం చేశాం.

– చొక్కాపు రాంబాయి, మహిళా రైతు, రామభద్రపురం

ప్రభుత్వ సహకారం లేదు



సొంత డబ్బులు పెట్టుబడి పెడుతూ పంటలు సాగు చేస్తున్నాం. గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పెట్టుబడి సాయం కింద ఏడాదికి రూ.15 వేలు వేసేది. ఆ డబ్బులు వ్యవసాయ పనులకు పెట్టుబడికి పనికొచ్చేవి. ఈ ప్రభుత్వం రూ. 20 వేలు ఇస్తామని చెప్పింది కానీ ఇప్పటికీ అతీగతి లేదు. ఉన్న కొద్దిపాటి భూమిలో కూరగాయలు పండించుకుంటూ జీవనం సాగిస్తున్నాం .పంటల సాగుకు ప్రభుత్వ సహకారం అందిస్తే మంచిది.

– చుక్క పైడితల్లి, కూరగాయల రైతు.రామభద్రపురం

ఇలా అన్ని రంగాలలో ఆరుగాలం కష్టపడుతూ కుటుంబ ఆర్థిక పరిస్థితిని చక్కదిద్దుతున్నారు.

పరిశ్రమల్లో భద్రత తప్పనిసరి



మాట్లాడుతున్న కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్, జేసీ ఎస్.సేతుమాధవన్, ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం అర్బన్: జిల్లాలోని అన్ని పరిశ్రమలు తమ సంస్థల్లో భద్రతకు అవసరమైన అన్ని చర్యలు తప్పనిసరిగా చేపట్టాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోరారు. పరిశ్రమల్లో ప్రమాదాలు జరగకుండా నిర్దేశిత ప్రమాణాల మేరకు ఆయా భద్రతా ఏర్పాట్లను వారం రోజుల్లోగా పూర్తి చేసి అంతర్గత ఆడిట్ నివేదికను అందజేయాలని పరిశ్రమల యాజమాన్యాలకు స్పష్టం చేశారు. ఈ మేరకు జిల్లాలోని పరిశ్రమల్లో చేపట్టాల్సిన భద్రత చర్యలపై సమీక్షించేందుకు ఆయా పారిశ్రామిక యాజమాన్యాలతో కూడిన జిల్లా స్థాయి క్రైసెస్ మేనేజ్‌మెంట్ గ్రూప్ సమావేశం ఫ్యాక్టరీల తనిఖీ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్‌లో జరిగింది. ఈ సందర్భంగా కల్టెర్ అంబేడ్కర్ మాట్లాడుతూ అంతర్గత ఆడిట్ పూర్తయినట్లు తెలియజేస్తే ఆయా పరిశ్రమలను జిల్లా స్థాయి అధికారులు, నిపుణులతో కూడిన కమిటీలు తనిఖీ చేసి నిర్ధారిస్తాయని పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని పరిశ్రమలు భద్రత చర్యలు చేపట్టడంతోపాటు భద్రత చర్యలపై మాక్ డ్రిల్ నిర్వహించి ఏవైనా ఘటనలు, ప్రమాదాలు జరిగినపుడు ఎలా వ్యవహరించాలనే అంశంపై అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ ప్రతి పరిశ్రమకూ ఏదైనా ప్రమాదం లేదా విపత్తు జరిగినపుడు తక్షణం ఎలా స్పందించాలి? ఎలాంటి చర్యలు చేపట్టాలనే అంశంపై స్పష్టమైన ప్రణాళిక ఉండాలని చెప్పారు. జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్ మాట్లాడుతూ పరిశ్రమల్లో ప్రమాదాలు జరిగేందుకు ఆస్కారం ఉన్న విభాగాలను గుర్తించి వాటి పనితీరు, నిర్వహణపై నిత్యం నిఘా పెట్టాలని సూచించారు. ఫ్యాక్టరీల విభాగం డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ సురేష్ మాట్లాడుతూ జిల్లాలో నాలుగు భారీ పరిశ్రమలు ఉన్నాయని తెలిపారు. ఈ పరిశ్రమల్లో చేపట్టిన భద్రత చర్యలపై ఎస్ఎంఎస్‌ఫార్మా, హెచ్‌బీఎల్, మైలాన్ సంస్థల ప్రతినిధులు వివరించారు. సమావేశంలో పరిశ్రమల శాఖ డీడీ కోటేశ్వరరావు, ఆర్‌డీఓలు ఎంవీసూర్యకళ, బి.శాంతి, సుధారాణి, డిప్యూటీ లేబర కమిషనర్ సుబ్రహ్మణ్యం, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ సరిత, ఏపీఐఐసీ అధికారులు మురళీమోహనరావు, రామకృష్ణ, అగ్నిమాపక అధికారులు, జిల్లాలోని వివిధ పారిశ్రామిక సంస్థల యాజమాన్య ప్రతినిధులు పాల్గొన్నారు.

చేపల చెరువులకు లైసెన్స్ తప్పనిసరి

పార్వతీపురంటౌన్: జిల్లాలో చేపల చెరువులకు లైసెన్స్ తప్పనిసరిగా తీసుకోవాలని మత్స్య శాఖ పార్వతీపురం మన్యం జిల్లా అధికారి పి.తిరుపతయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. చేపల చెరువులు తీసుకునే వ్యాపారస్తులకు ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఆక్వాకల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ 2020 ప్రకారం లైసెన్స్ మంజురు చేస్తుందని చెప్పారు. ఇ-మత్స్యకార్ లాగిన్‌లో గ్రామ మత్స్యశాఖ అసిస్టెంట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలని సూచించారు. దరఖాస్తుతో పాటు ఎకరాకి వెయ్యి రూపాయలు చొప్పున చెల్లించాలని, మండల సర్వేయర్ జారీ చేసిన ఆటోక్యాడ్ మ్యాప్, భూమి రెవెన్యూ అడంగల్, పట్టాదారు పాస్‌బుక్ లేదా లీజ్ అగ్రిమెంటు, పది రూపాయల బాండ్ పేపర్ పై 80 శాతం నికర చెరువు, 20శాతం గట్లు వేస్తానని హామీ ఇస్తూ అఫిడవిట్ ఉండాలని వివరించారు. అర్హత గల దరఖాస్తులకు జిల్లా, మండల స్థాయి కమిటీలు ద్వారా లైసెన్స్ మంజూరు చేయనున్నట్లు వివరించారు.

బీఎస్సీ ఎంఎల్‌టీ ఫలితాల్లో బొల్లినేని విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న నిర్వాహకులు

శ్రీకాకుళం రూరల్: బీఎస్సీ ఎంఎల్‌టీ డిగ్రీ ఫలితాల్లో రాగోలు జెమ్స్ కళాశాల బొల్లినేని మెడిస్కిల్స్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారని సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సిహెచ్ నాగేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్టీఆర్ విశ్వవిద్యాలయం విడుదల చేసిన ఈ ఫలితాల్లో మెడికల్ ల్యాబొరేటరీ టెక్నాలజీ విభాగంలో టాప్-10 ర్యాంకుల్లో సెకెండియర్ విద్యార్థులు డి.చందు, కె.మాలతి, ఎస్.సి.అంజలి, జి.ప్రమీలా, ఎ.కుమారి సత్తాచాటారని పేర్కొన్నారు. ఫస్టియర్ విద్యార్థిని ఎస్.శృతి ప్రథమ ర్యాంకు సాధించిందని చెప్పారు. మెరుగైన బోధన, నిరంతర పర్యవేక్షణతోనే ఈ ఫలితాలు వచ్చాయని డాక్టర్ ఈ.గిరిధర్ పేర్కొన్నారు.

29 నుంచి అలాహజరత్ ఉత్సవాలు

విజయనగరం టౌన్: జిల్లా వ్యాప్తంగా ఈ నెల 29 నుంచి 31 వరకూ అలాహజరత్ ఉత్సవాలను నిర్వహించనున్నట్లు జిల్లా శాఖ ముస్లింల ప్రతినిధి మహమ్మద్ గౌస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే సున్నీ మసీదుల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారన్నారు. స్థానిక ఆబాద్ వీధిలో ఉన్న మదరసా ఆల్ జామియాతుల్ హబీబియా ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ నెల 31న ఉదయం 9 గంటలకు అలా హజరత్ ఊరేగింపు నిర్వహిస్తున్నామన్నారు. ఉత్సవాల్లో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రేషన్ దుకాణాకారుల సంక్షేమ సంఘం ఏకగ్రీవం



నూతన కమిటీ సభ్యులను అభినందిస్తున్న దృశ్యం

- బాధ్యతలు చేపట్టిన నూతన కమిటీ

విజయనగరం అర్బన్: జిల్లా చౌకధరల దుకాణదారుల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని సంఘం సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక జిల్లా పరిషత్ మినిస్టీరియల్ సిబ్బంది సంక్షేమ సంఘం కార్యాలయంలో మంగళవారం జరిగిన సంఘం నూతన కమిటీ ఎన్నికల ప్రక్రియలో ఈ మేరకు నూతన కమిటీని ఎంపిక చేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఎస్‌కోటకు చెందిన బుగత వెంకటేశ్వర రావు, ప్రధాన కార్యదర్శిగా గేదెల సత్యనారాయణ, గౌరవ సలహాదారుగా రామ్మూర్తి నాయుడు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఈ.రాజగోపాల నాయుడు, జిల్లా కార్యదర్శిగా పాలూరి అప్పారావు, జిల్లా ఉపాధ్యక్షుడిగా అట్టాడ అప్పారావు, జిల్లా గౌరవ అధ్యక్షుడిగా సముద్రపు రామారావు, జిల్లా ముఖ్య సలహాదారుగా కుసుమంచి జగ్గయ్యశెట్టిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన కమిటీ సభ్యులు బాధ్యతలు స్వీకరించారు.

పుష్పాలంకరణలో పైడితల్లి



చదురుగుడిలో పుష్పాలంకరణలో పైడితల్లి అమ్మవారు



దర్శించుకుంటున్న భక్తులు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారు మంగళవారం పుష్పాలం కరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఏడిద రమణ ఆధ్వర్యంలో అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు చేశారు. సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్, మూలా పాపారావు, నేతేటి ప్రశాంత్‌లు అమ్మవారికి శాస్త్రోక్తంగా నిత్య పూజాదికాలు చేశారు. మహిళలు అమ్మవారిని దర్శించి పసుపు, కుంకుమలను సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ ఈఓ డీవీవీ.ప్రసాదరావు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

పైడితల్లి అమ్మవారి దీక్షలను విస్తృతం చేయాలి: ఆలయ ఈఓ డీవీవీ ప్రసాదరావు



సమావేశంలో మాట్లాడుతున్న ఆలయ ఈఓ డీవీవీ ప్రసాదరావు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం శ్రీ పైడితల్లి అమ్మవారి జాతర మహోత్సవాల నేపథ్యంలో దీక్షాపరుల సంఖ్యను పెంచేందుకు ఆలయ ఈఓ డీవీవీ ప్రసాదరావు, సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు నేత్రత్వంలో శ్రీపైడిమాంబ దీక్షాపీఠం వ్యవస్థాపకులు ఆర్.సూర్యపాత్రో, అచ్చిరెడ్డి, మహేష్‌లు మంగళవారం ఆలయ ఆవరణలో కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. పైడిమాంబ దీక్ష పరమ పవిత్రమని, భక్తకోటికి ముక్తిదాయకమన్నారు. దీక్షలు చేపట్టే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఈ ఏడాది ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఉత్తరాంధ్రాతో పాటూ ఒడిశా, చత్తీస్‌ఘడ్ వరకూ ఇటువైపు విశాఖ, అన్నవరం, తుని, విజయవాడ వరకూ అన్ని మార్గాల్లో కరపత్రాలు, వాల్‌పోస్టర్లు అంటించే కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు జి.మహేష్, కె.రంజిత్, తదితరులు పాల్గొన్నారు.

సూక్ష్మ ప్రణాళికలు తయారు చేయాలి

- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం: గ్రామాల అభివృద్ధికి గ్రామస్థాయి సూక్ష్మ ప్రణాళికలు తయారు చేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఎంపీడీఓలను ఆదేశించారు. ఈ మేరకు ఆయన మంగళవారం కలెక్టరేట్‌లోని కార్యాలయంలో ఎంపీడీలతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలాల్లో ఉపాధి హామీ పథకం కింద వివిధ కార్యక్రమాలను అనుసంధానం చేసి అభివృద్ధి పనులు చేయడంలో సరైన కార్యాచరణ ప్రణాళిక తయారుచేయాలని స్పష్టం చేశారు. లక్ష్య సాధన దిశగా పనితీరు ఉండాలని చెప్పారు. మండలాల్లో సమగ్రమైన డేటా తయారు చేయాలని సూచించారు. ఆరోగ్యం మెరుగుపరచడం, పౌష్టిక ఆహారాన్ని అందివ్వడం, సురక్షిత తాగునీరు అందించడం వంటి అంశాలు కూడా అభివృద్ధిలో భాగమని పేర్కొన్నారు. గ్రామ సచివాలయం సిబ్బం ది సేవలు సంతృప్తికర స్థాయిలో ఉపయోగించుకోవాలని సూచించారు. ఇసుక అక్రమ తవ్వకాలు ఎక్కడా జరగరాదని స్పష్టం చేశారు. ఎంపీడీఓలు కూడా పర్యవేక్షణ చేయాలని, ముఖ్యంగా తాగునీటి వసతులు, మౌలిక వసతులు ఉన్న ప్రదేశాల వద్ద నిర్దేశిత నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు జరగరాదన్నారు. సమావేశంలో పాలకొండ రెవెన్యూ డివిజనల్ అధికారి వి.వెంకట రమణ, పార్వతీపురం ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారి ఎ.మురళీధర్, పార్వతీపురం, పాలకొండ మున్సిపల్ కమిషనర్లు కె శ్రీనివాస్, ఎస్.సర్వేశ్వర రావు, ఎంపీడీఓలు పాల్గొన్నారు.

రాయితీపై తుంపర సేద్యం పరికరాలు

తక్కువ నీటివనరులతో వ్యవసాయం చేసేందుకు గిరిజనులకు తుంపర సేద్యం పరికరాలను రాయితీపై అందిస్తున్నట్లు కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీడీఏ పార్వతీపురం పరిధిలోగల గిరిజన సబ్ ప్లాన్ మండలాల్లోని గిరిజన రైతులకు తుంపర సేద్యం 2024-25 సంవత్సరానికి గాను రాయితీ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం ఐటీడీఏ పరిధిలో 750 మందికి గాను రూ. 53.79 లక్షలు నిధులు విడుదల చేశామని, ప్రతి రైతుకు ఆంధ్రప్రదేశ్ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్ తరఫున చిన్న, సన్నకార రైతులకు (5 ఎకరాల లోపు) 55 శాతం రాయితీ, పెద్ద రైతులకు (5 ఎకరాల నుంచి 12.5 ఎకరాల వరకు) 45శాతం రాయితీ ఇప్పటికే అందజేశామన్నారు. దీనికి అదనంగా ప్రతి గిరిజన రైతుకు రూ.7172లు ఐటీడీఏ తరఫున రాయితీ ఇవ్వనున్నట్లు తెలిపారు. పథకం పొందదలిచిన గిరిజన రైతులు సమీప రైతు సేవ కేంద్రంలో సంప్రదించాలని లేదా ఫోన్ 7995009841 నంబర్(కేశవ్, స్ప్రింకర్స్ ఇంజనీర్)లో సంప్రదించాలని సూచించారు.

జీడి తోటలను పునరుద్ధరించాలి

గిరిజనులను ఆర్థికంగా ప్రోత్సహించేందుకు జీడి తోటల పునరుద్ధరణ కార్యక్రమం చేపట్టాలని ఉద్యానశాఖాధికారులను కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. ఈ మేరకు ఆ శాఖాధికారులతో కలెక్టరేట్‌లో మంగళవారం ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్వతీపురం ఐటీడీఏ పరిధిలో 18 వందల ఎకరాల్లో జీడితోటల పునరుద్ధరణ కార్యక్రమం జరుగుతుందని, అందులో భాగంగా గుమ్మలక్ష్మీపురం 500 ఎకరాలు, కురుపాం 540, జియ్యమ్మవలస 200, కొమరాడలో 160, సాలూరులో 200, మక్కువలో 100, పార్వతీపురంలో 100 ఎకరాల్లో చేపట్టాలని ఆదేశించారు.

'సెరికల్చర్‌కు సిల్క్ సమగ్ర పథకం

సెరికల్చర్ రైతులు సిల్క్ సమగ్ర పథకాన్ని ఉపయోగించుకోవాలని కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ అన్నారు. మల్బరీ మొక్కల యూనిట్ ఖరీదు రూ.30 వేలు కాగా సిల్క్ సమగ్ర పథకం కింద ఎస్టీ,ఎస్సీ రైతులకు 90 శాతం, ఇతర వర్గాల రైతులకు 75 శాతం రాయితీ వస్తుందని చెప్పారు. సమావేశంలో ఉద్యాన, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పీఎంవీవై రుణాలు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

- రూ.2లక్షల వరకు రుణ మంజూరు అవకాశం
- టూల్ కిట్ కోసం రూ.15 వేలు ఇన్సెంటివ్
- జిల్లాలో అందిన 5,584 దరఖాస్తుల పునఃపరిశీలన
- చేతివృత్తులు, సంప్రదాయ వృత్తుల వారికి నైపుణ్య శిక్షణ
- కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం అర్బన్: ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన (పీఎంవీవై) పథకం కింద 18 రకాల కుల, చేతి, సంప్రదాయ వృత్తుల వారికి రూ.2 లక్షల వరకు రుణం అందజేయనున్నట్లు కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తెలిపారు. కలెక్టర్ చాంబర్‌లో మంగళవారం నిర్వహించిన పీఎంవీవై జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం జారీ చేసిన విశ్వకర్మ ఐడీ కార్డు కలిగిన వారికి 5 రోజుల ప్రాథమిక శిక్షణ అనంతరం రూ.15 వేలు విలువచేసే టూల్ కిట్‌ను ఇన్సెంటివ్‌గా అందజేస్తామని చెప్పారు. 5 శాతం వడ్డీతో మొదటి విడతగా బ్యాంకు నుంచి తీసుకున్న రుణాన్ని 18 నెలల్లో తీర్చాల్సి ఉంటుందన్నారు. విశ్వకర్మ పోర్టల్‌లో అందిన దరఖాస్తులు సచివాలయం పరిధిలో పరిశీలన అనంతరం అర్హత కలిగిన దరఖాస్తులను పునఃపరిశీలించారు. జిల్లా నుంచి 5,584 మంది రుణం కోసం దరఖాస్తు చేసినట్టు తెలిపారు. దరఖాస్తుదారు అదే వృత్తిలో కొనసాగుతున్నారా? లేదా? రుణానికి అర్హుడా? కాదా? అనే విషయాలను తనిఖీ చేయాలని అధికారులకు సూచించారు. సమావేశంలో పరిశ్రమల శాఖ డీడీ నాగేశ్వరరావు, డీపీఓ శ్రీధర్‌రాజా, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి గోవిందరావు, మెప్మా పీడీ సుధాకర్‌రావు, బీసీ కార్పొరేషన్ ఈడీ పెంటోజీరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలన్నీ గిరిజనులకు చేరాలి

కేంద్ర ప్రభుత్వ పథకాలను గిరిజనులు సద్వినియోగం చేసుకునేలా చైతన్యం కల్పించాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అధికారులకు ఆదేశించారు. పీఎంజన్‌మన్ కార్యక్రమం ప్రచారంలో భాగంగా గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో రూపొందించిన పోస్టర్లను కలెక్టర్ తన కార్యాలయంలో మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 11 మండలాల్లోని 53 గ్రామాల్లో చేపడుతున్న అవగాహన శిబిరాలు విజయవంతం కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జేసీ ఎస్.సేతుమాధవన్, డీఆర్‌ఓ అనిత, గిరిజన సంక్షేమ అధికారి రామానందం తదితరులు పాల్గొన్నారు.